క్లుప్తంగా

ధర్మపురిలో సబ్ ట్రెజరీ ఏర్పాటు చేయాలి



విప్‌కు వినతిపత్రం ఇస్తున్న ఉపాధ్యాయులు

ధర్మపురి: నియోజకవర్గ కేంద్రంలో ఉద్యోగుల సౌకర్యార్థం సబ్ ట్రెజరీ ఏర్పాటు చేయాలని బుధవారం పీఆర్‌టీయూఎస్ నాయకులు ప్రభుత్వ విప్‌కు వినతి పత్రం అందజేశారు. సబ్ ట్రెజరీ ఏర్పాటు కోసం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క దృష్టికి వెళ్లేలా ప్రతిపాదనలు పంపిస్తానన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆనందరావు, అమర్నాథ్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కౌశిక్‌రెడ్డి తీరు సరైనది కాదు'



ఎమ్మెల్యేకు సంఘీభావం తెలుపుతున్న నాయకులు

జగిత్యాల: హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌పై చేసిన అనుచిత వ్యాఖ్యలు, ప్రవర్తన పట్ల ఐఎంఏ అసోసియేషన్ నాయకులు తీవ్రంగా ఖండించారు. బుధవారం ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ను ఐఎంఏ నాయకులు కలిశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రజల నాయకుడైన డాక్టర్ సంజయ్‌కుమార్‌ను తోటి ఎమ్మెల్యే అయి ఉండి అతని ప్రవర్తన, తీరు ప్రజాస్వామ్యంలో సరైనది కాదన్నారు. కార్యక్రమంలో ఐఎంఏ అధ్యక్షుడు డాక్టర్ హేమంత్, ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, శశికాంత్‌రెడ్డి, శ్రీలత, రజిత, సుదీర్, ఉదయ్‌గౌడ్, లక్ష్మీనారాయణ, నవీన్ పాల్గొన్నారు.

తప్పుడు ప్రచారంపై కాంగ్రెస్ ఫిర్యాదు

మల్యాల: చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం పరువుకు నష్టం కలిగించేలా వైఆర్‌టీవీ యూట్యూబ్ ఛానల్‌లో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మల్యాల పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు వినయ్ ఆధ్వర్యంలో మల్యాల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నెల 14న చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యంపై వ్యక్తిగత ఆరోపణలతోపాటు, చొప్పదండి ప్రజల మనోభావాలు దెబ్బతీసేలా వైఆర్‌టీవీ ఛానల్‌లో ప్రసారం చేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు ముత్యం శంకర్ గౌడ్, కోరెపు వెంకటేశ్, కొత్తకొండ శ్రీనివాస్, గుర్రం శ్రీకాంత్, మ్యాకల శ్రీకాంత్, సంత ప్రకాశ్ రెడ్డి, ఎ.సాయి కుమార్ పాల్గొన్నారు.

గాలిపటాలు ఎగరేయొద్దు



గాలిపటాలు తొలగిస్తున్న సిబ్బంది

రాయికల్: పట్టణంతో పాటు, మండలంలోని 32 గ్రామాల్లో యువతీ, యువకులు గాలిపటాలు ఎగరేయద్దని, దీంతో కరెంట్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడుతోందని రాయికల్ ఏఈ తుమ్మల నవీన్ బుధవారం తెలిపారు. రాయికల్ పట్టణంలో యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేయడంతో విద్యుత్ సరఫరాలో అంతారం ఏర్పడుతోందని, దీంతో పీపీఆర్ దెబ్బతినే అవకాశం ఉందని పేర్కొన్నారు.

లక్ష్యంతో ముందుకు సాగితే విజయం సొంతం



విజేత టీంతో ఎస్సై, నాయకులు

మల్లాపూర్: యువత సన్మార్గంలో ముందుకెళ్లి ఒక సమున్నత లక్ష్యంతో ముందుకు సాగితే విజయం సొంతమవుతుందని ఎస్సై రాజు అన్నారు. బుధవారం మల్లాపూర్‌లో పద్మశాలీ యువసేన ఆధ్వర్యంలో నిర్వహించిన బ్యాడ్మింటన్ టోర్నమెంట్ ముగింపు వేడుకలకు హాజరై విజేతలకు బహుమతులు ప్రదానం చేసి మాట్లాడారు. యువత చిన్నప్పటి నుండే కష్టపడేతత్వాన్ని అలవర్చుకుని ఒక గొప్ప లక్ష్యం వైపు అడుగులు వేస్తే కన్న తల్లిదండ్రులకు, పుట్టిన ఊరితో పాటు దేశానికి గర్వకారణంగా నిలిచిపోవచ్చన్నారు. కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్, సత్యనారాయణగౌడ్, పద్మశాలీ యువసేన నాయకులు పాల్గొన్నారు.

ఘనంగా సంక్రాంతి వేడుకలు

జగిత్యాలరూరల్/రాయికల్/ధర్మపురి/మెట్‌పల్లి/ సారంగాపూర్/కథలాపూర్/పెగడపల్లి/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్/మల్యాల: సంక్రాంతి వేడుకలు మంగళవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఆడబిడ్డలు, కుటుంబ సభ్యులు పండుగకు ఇళ్లకు రావడంతో గ్రామాల్లో సంక్రాంతి సందడి నెలకొంది. యువకులు, చిన్నారులు గాలిపటాలు ఎగురవేస్తూ సంబరాలు నిర్వహించారు. ఆయా గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పలు గ్రామాల్లో ముగ్గుల పోటీలు, యువకులు వాలీబాల్, క్రికెట్ పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఇళ్ల ఎదుట ముగ్గులు, ఇంటిల్లిపాది సామూహిక భోజనాలు, పిండివంటల ఘుమఘుమలతో సంక్రాంతి సంబురాలు ఘనంగా జరుపుకున్నారు.



పెగడపల్లిలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు, మహిళలు



రాయికల్: మైతాపూర్‌లో ఎడ్లబండిని ఊరేగిస్తున్న గ్రామస్తులు



సారంగాపూర్ ముగ్గులు వేస్తున్న ముస్లిం యవతులు





మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో విజేతలకు బహుమతులు అందిస్తున్న నిర్వాహకులు



ఇంటి ముందు ముగ్గు వేస్తున్న చిన్నారి



కోరుట్ల: బహుమతులు అందించిన ఎంఈవో



మల్యాలలో ముగ్గు వేస్తున్న చిన్నారి



ధర్మపురిలో ఇంటి ముందు ముగ్గు వేస్తున్న మహిళలు

కనుమ వేడుకలు



గోమాతకు పూజ చేస్తున్న భక్తులు

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి సురభి గోశాలలో బుధవారం ఘనంగా కనుమ పండగ నిర్వహించారు. ఈ సందర్భంగా గోశాలలో గోమాతను పూజించారు.

రాయికల్: మండలంలోని మైతాపూర్ గ్రామంలో హిందూ చైతన్య వేదిక ఆధ్వర్యంలో కనుమ సందర్భంగా బుధవారం ఎడ్లబండ్లను ఊరేగించారు. గ్రామస్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

బీర్‌పూర్ జాతరలో గండదీపం నూనె విక్రయానికి వేలం

సారంగాపూర్: వచ్చే నెల 7 నుంచి 19 వరకు జరిగే బీర్‌పూర్ శ్రీలక్ష్మీనృసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో గండదీపం నూనెను విక్రయించడానికి శుక్రవారం 17న బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. గండదీపంలో భక్తులు సమర్పించే నూనెను జాతర రోజుల్లో విక్రయించడానికి మధ్యాహ్నం 2 గంటలకు బహిరంగ వేలం పాటలో పాట దారుడు ముందుగా రూ. 50 వేలు డిపాజిట్ చేయాలని తెలిపారు. కాగా స్వామివారి కల్యాణవేదిక అలంకారం, జాతర రోజుల్లో ఆలయాన్ని పూలతో అలంకరించడం, ఆలయానికి రంగులు ఇతరత్రా పనుల నిర్వహణకు సీల్డు టెండర్లు నిర్వహిస్తామని తెలిపారు

పసుపు బోర్డు ఏర్పాటుపై సంబరాలు







కోరుట్ల, మెట్‌పల్లి , రాయికల్‌లో ప్రధాని మోదీ, ఎంపీ అర్వింద్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్/మెట్‌పల్లి/మెట్‌పల్లిరూరల్/ రాయికల్/ఇబ్రహీంపట్నం/మల్లాపూర్: కేంద్ర ప్రభుత్వం జాతీయ పసుపు బోర్డు ఏర్పాటు చేయటాన్ని స్వాగతిస్తూ భారతీయ జనతా పార్టీ శ్రేణులు మంగళవారం ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అరవింద్ చిత్రపటాలకు కోరుట్ల పట్టణంలోని కార్గిల్ చౌక్ వద్ద, కోరుట్ల మండలం యూసూఫ్‌నగర్‌లో, రాయికల్ మండలం భూపతిపూర్‌లో,మెట్‌పల్లి పట్టణంలో,మెట్‌పల్లి మండలం బండలింగాపూర్,జగ్గాసాగర్,ఆత్మకూర్,తదితర గ్రామాల్లో, మల్లాపూర్‌లోని భరతమాత కూడలి వద్ద, ఇబ్రహీంపట్నంలో క్షీరాభిషేకాలు చేశారు. కార్యక్రమాల్లో బీజేపీ, పార్టీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్ప పడిపూజ



పడిపూజలో అయ్యప్ప స్వాములు, విప్

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప పడిపూజ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. మంగళవారం మకర సంక్రాంతి పర్వదినం సందర్భంగా శబరిమలలోని పొన్నాంబలంపై మకర జ్యోతి దర్శనం సందర్భంగా ధర్మపురిలో గురుస్వాములు పెండ్యాల బాలకృష్ణ స్వామి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో మహా పడిపూజ నిర్వహించారు. గురుస్వాముల మంత్రోచ్చారణలతో ప్రత్యేక పూజలను నిర్వహించి పదనెట్టాంబడిని వెలిగించారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆలయ వ్యవస్థాపకులు భీమనాధి మంగ అశోక్, బ్రాహ్మనోత్తములు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో విద్యార్థిని ప్రతిభ



ట్రోఫీతో గుండు హాసిని

కొండగట్టు: తెలంగాణ రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీల్లో అండర్ -17 బాలికల విభాగంలో సోమవారం జగిత్యాల జట్టు బాలికలు ప్రతిభ కనబరిచారు. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం కొండాపూర్ గ్రామానికి చెందిన గుండు హాసిని అనే విద్యార్థిని రాష్ట్రస్థాయిలో కబడ్డీలో ఉత్తమ ప్రతిభ కనబరిచి మూడో స్థానంలో నిలిచి ట్రోఫీ గెలుచుకున్నట్లు ప్రధాన కార్యదర్శి ఆరె తిరుపతి తెలిపారు.విద్యార్థినిని గ్రామస్తులు బుధవారం అభినందించారు.

అయ్యప్ప ఆలయంలో మకర జ్యోతి వేడుకలు



మకర జ్యోతి వేడుకల్లో అయ్యప్ప స్వాములు



ఇరుముడితో పదునెట్టాంబడి ఎక్కుతున్న గురుస్వామి

కోరుట్ల: పట్టణంలోని అయ్యప్ప గుట్టపై ఉన్న అయ్యప్ప,జ్ఞాన సరస్వతీ ఆలయంలో మంగళవారం మకర జ్యోతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామి వారికి ప్రత్యేక పూజలు, పడిపూజ, పంచామృతాభిషేకం నిర్వహించారు. భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. మకర జ్యోతి దర్శనం అనంతరం పవలింపు సేవ నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, అర్చకుడు రాము శర్మ,పాల్గొన్నారు.

ఘనంగా అయ్యప్పకు ఇరుముడుల సమర్పణ

ధర్మపురి: పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులు స్వామివారికి బుధవారం ఘనంగా ఇరుముడులను సమర్పించారు. గురుస్వామి పెండ్యాల బాలకృష్ణ మంత్రోచారణలతో 41 రోజులు దీక్షలు చేపట్టి బుధవారం మాల విరమణ చేశారు.

మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుందాం

కథలాపూర్: మన సంస్కృతీ సాంప్రదాయాలను కాపాడుకుంటూ ముందుకెళ్లాలని అఖిల భారత సామాజిక సమరసత కళావిభాగం కన్వీనర్ అప్పాల ప్రసాద్ అన్నారు. మండలంలోని గంభీర్‌పూర్‌లో బుధవారం నిర్వహించిన సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొని మాట్లాడారు. ప్రతీ ఒక్కరు ధర్మాన్ని కాపాడి దేశాభివృద్ధిలో భాగస్వాములు కావాలన్నారు. కార్యక్రమంలో మండల ప్రతినిధులు సుదర్శన్, తెడ్డు మహేశ్, దాసరి జలంధర్, వన్నెల రాజాగౌడ్, మల్లారెడ్డి, కొండగట్టు, సాయితేజ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



ఆండాళమ్మ(ఫైల్)

రాయికల్: మండలంలోని బోర్నపల్లి గ్రామానికి చెందిన చెన్నమనేని ఆండాళమ్మ (105) అనే శతాధిక వృద్ధురాలు బుధవారం అనారోగ్యంతో మృతిచెందింది. ఆండాళమ్మకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

బీజేపీ మండలాధ్యక్షుడికి సన్మానం



మారుతిని సన్మానిస్తున్న మంత్రి బండి సంజయ్

కథలాపూర్: బీజేపీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన మల్యాల మారుతిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ కరీంనగర్‌లో మంగళవారం సన్మానించారు. మండలంలో బీజేపీ బలోపేతానికి మరింత కృషి చేయాలని మారుతికి సూచించారు. ఆయన వెంట రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ ఉన్నారు.

గద్దర్ గళం మండల కన్వీనర్‌గా రవీందర్

మల్యాల: ప్రజా యుద్ధ నౌక గద్దర్ కాంస్య విగ్రహాలను ఏర్పాటు చేసేందుకు, గద్దర్ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం చేసిన ఉద్యమాన్ని, ఆయన సేవలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జెల స్వామి అన్నారు. బుధవారం మల్యాల మండలం గద్దర్ గళం మండల కన్వీనర్‌గా ముప్పారపు రవీందర్, కోకన్వీనర్‌గా చెలుమల్ల భూమేశ్‌ను నియమిస్తూ గద్దర్ గళం ఫౌండేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గజ్జెల స్వామి, జగిత్యాల జిల్లా కన్వీనర్ ఈదుల లక్ష్మణ్ నియామకపు పత్రాలను అందజేశారు.

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా వేల్పుల స్వామి



వేల్పుల స్వామి

రాయికల్: రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడిగా రాయికల్ మండలం ఇటిక్యాల ఉన్నత పాఠశాలలో హిందీ పండిట్‌గా పనిచేస్తున్న వేల్పుల స్వామియాదవ్‌ను నియమిస్తూ రాష్ట్ర అధ్యక్షుడు అబ్దుల్లా బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా స్వామి యాదవ్ మాట్లాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానని తెలిపారు.

ఇసుక లారీలు పట్టివేత

కోరుట్ల రూరల్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న రెండు లారీలను మంగళవారం రెవెన్యూ అధికారులు మండలంలోని మోహన్‌రావు శివారులో పట్టుకున్నారు. పట్టుకున్న లారీలను సీజ్ చేసి కోరుట్ల బస్ డిపోకు తరలించారు. కార్యక్రమంలో రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వై. రాజేందర్ రావు,రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డెక్కిన అద్దె బస్సులు

కోరుట్ల రూరల్: కోరుట్ల ఆర్టీసీ డిపోలో అద్దె బస్సులు బుధవారం రోడ్డెక్కాయి. తమ డిమాండ్ల సాధన కోసం అద్దె బస్సు డ్రైవర్లు మంగళవారం సమ్మెకు దిగటంతో 25 బస్సులు డిపోలోనే నిలిచి పోయాయి. దీంతో పలు రూట్లలో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. కాగా అద్దె బస్సుల యజమానులకు, డ్రైవర్లకు మధ్య రాత్రి జరిగిన చర్చలు సఫలం కావటంతో బుధవారం ఉదయం బస్సులు యథావిధంగా నడిచాయి.

గోదావరిలోకి చేరిన ఎస్సారెస్పీ నీరు



కమ్మునూర్ వద్ద గోదావరి ప్రవాహం

సారంగాపూర్/ధర్మపురి: ప్రభుత్వం గోదావరి ఒడ్డున ఉన్న ఎత్తిపోతల పథకాలకు సాగునీరు అందించడానికి శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి గోదావరిలోకి 1 టీఎంసీ నీటిని విడుదల చేసింది. బుధవారం బీర్‌పూర్ మండలంలోని పలు గ్రామాల ఎత్తిపోతల పథకాలకు నీరు చేరింది. దీంతో రాయికల్, బీర్‌పూర్, ధర్మపురి, వెల్గటూర్ మండలాల్లోని పలు గ్రామాలకు సాగు నీరు అందనుంది. 12 ఎత్తిపోతల పథకాల కింద 15 వేల ఎకరాలకు సాగు నీరు అందకపోవడంతో ఇటీవల ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి రైతుల పరిస్థితిని వివరించారు. దీంతో ఎస్సారెస్పీ నుంచి 1 టీఎంసీ నీటిని విడుదల చేయగా, బీర్‌పూర్ మండలం కమ్మునూర్, మంగేళ, రేకులపల్లి, చిన్నకొల్వాయిలోని ఎత్తిపోతల పథకాలకు, ధర్మపురి మండలంలోని పలు గ్రామాలకు సాగునీరందనుంది. ఈ సందర్భంగా రైతులు, నాయకులు విప్ అడ్లూరి, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్ మండలం తక్కళ్లపల్లి గ్రామంలోని ఓ కాలనీలో విద్యుత్ పోల్స్ లేకపోవడంతో ఆ కాలనీలో వీధిలైట్లు కూడా ఏర్పాటు చేయలేదు. దీంతో రాత్రివేళల్లో ఇంటి నుంచి బయటకు వచ్చేందుకు కాలనీవాసులు జంకుతున్నారు. విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేసి వీధిలైట్లు బిగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.



సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
సురేందర్ రాథోడ్, ట్రాన్స్‌కో ఏఈ, పొలాస సెల్ నంబర్: 9491058667

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

మందకృష్ణ మాదిగ సభను విజయవంతం చేయాలి

రాయికల్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ ఈనెల 24న జగిత్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించే సన్నాహక ప్రదర్శన సభకు హాజరు కానున్నారని, దానిని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు వేణుగోపాల్ కోరారు. మండలంలోని కిష్టంపేటలో సంఘ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి డప్పు కళాకారులు, మాదిగ ఉప కులాలు, సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శికి సన్మానం

మల్లాపూర్: సంక్రాంతి ఉత్సవాల్లో పాల్గొనేందుకు మండలంలోని స్వగ్రామం రాఘవపేటకు విచ్చేసిన యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుద్దు అమృతని బుధవారం తెలంగాణ ప్రజాసంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు పేట భాస్కర్ ఘనంగా సన్మానించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన పదవులను పొంది ఉన్నత స్థానానికి చేరుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్నూరుకాపు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు బండారి శంకర్, రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు ఎలిశెట్టి గంగారెడ్డి, జిల్లా కార్యదర్శి దేశెట్టి రాజరెడ్డి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.